ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 40.3 । కనిష్ఠం 25.7



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.32 (సోమవారం సాయంత్రం)
సహర్ : 5.00 (మంగళవారం ఉదయం)

బిద్దత్ (చేయకూడని, నిషేధించబడిన పనులు) అనుసరించే వ్యక్తి ఆ బిద్దత్‌ను వదులే వరకు అతని మంచిపనులను అల్లాహ్ అంగీకరించడానికి నిరాకరిస్తాడు



పిట్టగూడెంలో మూతపడ్డ అంగన్‌వాడీ కేంద్రం



• పిట్టగూడెంలో మూతపడ్డ అంగన్‌వాడీ కేంద్రం

గిరిజనులను వెంటాడుతున్న పౌష్టికాహార లోపం

• జిల్లాలో గిరిజన ప్రాంత ప్రజలను పీడిస్తున్న రక్తహీనత • నివారణ చర్యలు చేపట్టినా ఫలితాలు ఇవ్వని వైనం
• మరణాలు సంభవిస్తున్నా చైతన్యం కరువే.. • అంగన్‌వాడీల సేవలు అంతంత మాత్రమే..

ఉట్నూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాలు గడుస్తున్నా ఏజెన్సీ ప్రాంతాల ప్రజలను రక్తహీనత, పౌష్టికాహారం లోపం వెంటాడుతూనే ఉంది. ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున ఉట్నూర్ మండలంలోని లక్కారంలో శ్రీవిద్య అనే కోలాం గిరిజన బాలింత రక్తహీనత లోపంతో మృతిచెందగా ఆమె చిన్నారి పాపకు తల్లిలేని లోటు మిగిలింది. ప్రతీఏటా ఏజెన్సీలో గర్భిణులు, బాలింతలకు రక్తహీనత ఏర్పడి మహిళలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. గిరిజన ప్రాంతాల మహిళలు, బాలింతల్లో, గర్భిణుల్లో తీవ్ర రక్తహీనత కనిపిస్తున్న ఆశించిన వైద్య సేవలు అందడం లేదని ప్రజలు అంటున్నారు. చాలామంది మహిళల్లో హిమోగ్లోబిన్ శాతం తక్కువగానే ఉంటుందని, తద్వారా రోగ నిరోధక శక్తి తగ్గిపోయి మరణాలు సంభవించే అవకాశాలు మెండుగా ఉంటాయని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

ఎన్‌ఆర్‌సీ సేవలు సద్వినియోగంచేసుకోవాలి

ఉట్నూర్‌లోని జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన పౌష్టిక ఆహార పునరావాస కేంద్రం (ఎన్‌ఆర్సీ) సేవలను సద్వినియోగం చేసుకోవడంలో ఏజెన్సీ ప్రాంతాల ప్రజలు విఫలమవుతున్నారు. ఏజెన్సీ వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో రక్తహీనత, పౌష్టికాహార లోపం అధిగమించడానికి చర్యలు తీసుకుంటున్న గిరిజన ప్రాంతాల ప్రజలు సంపూర్ణ సేవలు అందుకోలేకపోతున్నారు. గిరిజన గ్రామాలలో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం అందించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు రక్తలేమి



రక్తహీనతతో బాధపడుతున్న శిశువు

ఉండకుండా చర్యలు తీసుకుంటున్నది. వారికి కోడిగుడ్లు, పప్పు అన్నం, తాజా కూరగాయల భోజనం అందిస్తున్నారు. అదేమాదిరి ఆయాగ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న గర్భిణీలు, బాలింతలకు సైతం రక్తలేమి అధిగమించడానికి కృషిచేస్తున్నారు. అయినప్పటికీ ప్రసవ సమయంలో చాలామంది గర్భిణీలకు రక్తలేమి సమస్య ఏర్పడుతోందని ఏజెన్సీ ప్రజలు అంటున్నారు. అంగన్‌వాడీ సెంటర్ల టీచర్లు, ఆయాలు రక్తలేమితో బాధపడుతున్న చిన్నారులను పౌష్టిక ఆహార కేంద్రాలకు తరలించి వారికి మెరుగైన చికిత్స అందించడానికి కృషిచేయాల్సి ఉంది. ఉట్నూర్ మండల కేంద్రంలోని జిల్లా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఎన్‌ఆర్‌సీకి తరలించాల్సి ఉన్నప్పటికి చాలామంది అంగన్‌వాడీ టీచర్లు సరిగా స్పందించడం లేదని తెలుస్తోంది. దీంతో గ్రామాల్లో బాధితుల సంఖ్య పెరుగుతున్నట్లు తెలు



ఉట్నూర్‌లోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి

స్తోంది. ఏజెన్సీలోని అంగన్‌వాడీ టీచర్లు పౌష్టిక ఆహార లోపంతో బాధపడుతున్న వారినిఎన్‌ఆర్‌సీకి తరలించేలా అవగాహన కల్పించాల్సి ఉన్న అంతగా కృషి చేయడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి.

మరణాలు సంభవిస్తున్నా చైతన్యం కరువే

ఏజెన్సీ గ్రామాల్లో పౌష్టిక ఆహారలోపం, (తరువాయి 6వ పేజీలో..)



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట

• ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్

ఉట్నూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కడెం మండలంలోని లక్ష్మీనగర్ గ్రామానికి చెందిన సోగ్గల సుధాకర్‌కు ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మబొజ్జుపటేల్ సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆదివారం ఉట్నూర్ మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. ఆపద సమయంలో సీఎంఆర్‌ఎఫ్ పేదలకు ఆర్థికంగా ఎంతో తోడ్పాటును అందిస్తుందని పేర్కొన్నారు. పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో అత్యధికంగా సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు దాసడ్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం కల్పించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి: టీపీవో

ఆదిలాబాద్ రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఆర్‌ఎస్ పథకంలో క్రమబద్ధీకరణకు ప్రభుత్వం కల్పించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని టీపీవో సుమలత అన్నారు. ఆదివారం ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు రాయితీపై టీచర్స్ కాలనీలో మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, టీపీవో అవగాహన కల్పించారు. గతంలో దరఖాస్తు చేసుకున్నవారి పత్రాలను పరిశీలించి సందేహాలను నివృత్తిచేశారు. టీపీవో సుమలత మాట్లాడుతూ 2020లో అక్రమ లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు రూ.వెయ్యి కట్టి దరఖాస్తు చేసుకున్నవారి కోసం ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. మార్చి 31లోపు ఫీజు చెల్లిస్తే 25శాతం రాయితీ వర్తిస్తుందని తెలిపారు. అక్రమ లేఅవుట్లలో 10శాతం రిజిస్ట్రేషన్ అయినవారు కూడా క్రమబద్ధీకరణకు ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందన్నారు. ఎలాంటి సందేహాలున్న మున్సిపల్ కార్యాలయంలో వార్డు అధికారులు అందుబాటులో ఉండినివృత్తి చేస్తారని, ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న టీపీవో సుమలత



ఇఫ్తార్‌లో పాల్గొన్న ఏఐసీసీ సభ్యుడు

రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనది

ఏఐసీసీ విచార్ విభాగ్ సభ్యులు తుల అరుణ్‌కుమార్

బోథ్, మార్చి16 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం ముస్లింలకు ఎంతో పవిత్రమైనదని, పవిత్ర మాసంలో కఠినమైన ఉపవాస దీక్షలను ఆచరించడం అభినందనీయమని ఏఐసీసీ విచార్ విభాగ్ సభ్యులు తుల అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. సోనాల మండల కేంద్రంలో జరిగిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో మైనారిటీ సోదరులతో కలిసి విందు కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. కష్టమైనప్పటికీ ముస్లిం సహోదరులు ఉపవాస దీక్షలు చేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మైనార్టీ యువకులు పాల్గొన్నారు.

కొత్తూర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

తలమడుగు, మార్చి16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తూరు గ్రామపంచాయతీలో సీసీ రోడ్డు నిర్మాణానికి బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ తోట వెంకటష్ మాట్లాడుతూ బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ సహకారంతో జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద నిధులు మంజూరయ్యాయన్నారు. కొత్తూరు గ్రామంలో మూడు లక్షల రూపాయల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ చేపట్టడం జరుగుతుందన్నారు. అదేవిధంగా పనుల్లో నాణ్యత పాటించి త్వరగా పూర్తిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు ప్రకాష్, యువ నాయకులు పిడుగు అబిరాం రెడ్డి, మహిళా నాయకురాలు ఠాగూర్ పల్లవి, మాజీ సర్పంచ్ రాంబాయి, జిల్లా నాయకుడు కిరణ్ కుమార్, అబ్దుల్లా, రమాకాంత్, మాజీ సర్పంచ్ ఆశన్న యాదవ్, రామ్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు

క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ఉద్యోగం సాధించవచ్చు

తలమడుగు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ప్రభుత్వ ఉద్యోగం సాధించవచ్చని సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డి అన్నారు. ఆదివారం తలమడుగు మండలంలోని సుంకిడి గ్రామానికి చెందిన తేజస్విరెడ్డి గ్రూప్ 2, 3లో ఉద్యోగాలు సాధించడంతో ఆమెను శాలువాతో సత్కరించారు. అలాగే అదే గ్రామానికి చెందిన గుమ్ముల కార్తిక్ జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించడంతో సామాజిక కార్యకర్త అతనిని కూడా శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో శేఖర్‌రెడ్డి, హరీష్‌రెడ్డి, రాకేష్, మనీష్ రెడ్డి,రఘు, రాహుల్ రెడ్డి, సురేందర్ రెడ్డి, దినేష్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, తదితరులు ఉన్నారు.



ప్రభుత్వ ఉద్యోగం సాధించిన తేజస్విరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

రాజీవ్ యువవికాస పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్, మార్చి16 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాస పథకానికి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని గిరిజన నిరుద్యోగ యువత ఈ పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తిగల అర్హులైన గిరిజన నిరుద్యోగుల ఓబీఎంఎంఎస్ ఆన్‌లైన్ పోర్టల్ టీజీఓబీఎంఎంఎస్‌ఎన్‌ఈడబ్ల్యు, సీజీజీ.జీవోవీ.ఇన్ ద్వారా దరఖాస్తులు నమోదు చేసుకోవాల్సిందిగా తెలిపారు. అర్హత ప్రమాణాలు, పథకాలు తదితర అన్ని వివరాలు టీజీఓబీఎంఎంఎస్.సీజీజీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచిన వివరాలను పూర్తి స్థాయిలో చదవవచ్చని పేర్కొన్నారు. ఆసక్తిగల అర్హులైనవారు మార్చి 17 నుంచి వచ్చే నెల ఏప్రిల్ 5 వరకు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా తెలిపారు. ఇంకా వివరాలకు ఐటీడీఏ ఉట్నూర్ కార్యాలయంలో గాని, సంబంధిత జిల్లా డీడీ కార్యాలయంలో గాని సంప్రదించాల్సిందిగా తెలిపారు.

సేవాలాల్ విగ్రహ ఏర్పాటుకు ఎమ్మెల్యే ఆర్థికసాయం

నేరడిగొండ, మార్చి16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్‌ధరి గ్రామంలో సేవాలాల్ మహారాజ్ విగ్రహం ఏర్పాటుకోసం ఆదివారం తన నివాసంలో బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ రూ.51 వేలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ లంబాడా తండాలలో సేవాలాల్ మహారాజ్ విగ్రహం ఏర్పాటుకు తనవంతు సహాయంగా రూ.51వేలను అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గ్రామ ప్రజలు తరఫున ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాథోడ్ పరశురాం, గ్రామ సర్పంచ్ జాదవ్ సుభాష్, గ్రామ నాయక్ పవార్ ప్రకాష్ నాయక్, రాథోడ్ రామారావు, జాదవ్ తానాజీ, చవాన్, రాహుల్, పవార్ ధర్మా, రాథోడ్ ఆత్మారం రాథోడ్ దశరథ్, గ్రామస్థులు, యూత్ యువకులు, మహిళలు తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

ఆదిలాబాద్ రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని దారుల్ అన్సర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని కచ్‌కంటి రోడ్డులో గల ఓ ఫంక్షన్ హాలులో పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. రూ.1500 విలువగల రేషన్ ప్యాకేజీలను 70మంది పేదలకు అందించారు. పదేళ్లుగా సొసైటీ తరఫున సేవ కార్యక్రమాలు అందిస్తున్నామని మాజీ అధ్యక్షులు ఖాజా నజీమోద్దీన్ అన్నారు. వేసవిలో చల్లటి నీరు, చలికాలంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్నామని వివరించారు. ప్రతీఏటా మాదిరిగానే ఈ సంవత్సరం కూడా రంజాన్ మాసంలో దాతల సహకారంతో పేదలకు సరుకులను పంపిణీ చేశామని తెలిపారు. ఇలానే దాతలు సహకారం అందించి పేదలకు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో మహ్మద్ వసీం, మహ్మద్ రోషన్, ఆరీఫ్ ఖాన్, జమీద్, అబ్దుల్ మొయిజ్, అజ్జు పాల్గొన్నారు.



సరుకులు పంపిణీ చేస్తున్న సొసైటీ సభ్యులు



ఇందిరమ్మ నమూనా ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ఇందిరమ్మ నమూనా ఇంటి పనుల పరిశీలన

తాంసి, మార్చి16 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ నమూనాలను ఇంటి నిర్మాణ పనులను ఆదివారం సాయంత్రం డీసీసీబీ అధ్యక్షుడు అడ్డి బోజారెడ్డి పరిశీలించారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం ఏ విధంగా ఉంటుందో సంబంధిత శాఖ అధికారులను అడిగి వివరాలు సేకరించారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరుచేసే ఇళ్లను ఈ విధంగా నిర్మించాలన్న ఉద్దేశంతో వాటిని పరిశీలించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నమూనా ఇల్లు లబ్ధిదారులకు అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు. ఆయా మండలాల్లోని అధికారులు, ప్రజాప్రతినిధులు మండలకేంద్రంలో నిర్మించిన ఇళ్లను ఆధారంగా చేసుకుని నిర్మించాలని సూచించారు. ఎక్కడ కూడా అవకతవకలు జరగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. అధికారులు వారి వారి విధులను బాధ్యత యుతంగా నిర్వహిస్తూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి కోసం సహకరించాలన్నారు. ఆయనతో పాటు అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు గడుగు గంగన్న, లింగారెడ్డి, నామ్ దేవ్, తదితరులు ఉన్నారు.

వంజరి సంఘ నూతన కార్యవర్గం ఏర్పాటు

బోథ్, మార్చి16 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బంజార కులస్తులు నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. బోథ్ పట్టణ నూతన అధ్యక్షుడిగా కలిపే శ్రీనివాస్ ఉపాధ్యక్షుడిగా కానుకంటి రమేష్, ప్రధాన కార్యదర్శిగా బోనగిరి రాజు, కోశాధికారిగా దోనగిరి చరణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితోపాటు కార్యవర్గ సభ్యులుగా శేఖర్, వినోద్, నారాయణ, రవి, సంతోష్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సీఎం పూటకో మాట

• ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ మాదిగ

ఆదిలాబాద్ రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట ఐదు రోజులుగా నిరసన రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఆగస్టు 1న వచ్చిన నాడు ఒకమాట.. గత ఏడు నెలలుగా ఎన్నోరకాలుగా ఊసరవెల్లిలా మాటలు మారుస్తున్నాడని విమర్శించారు. తన సీఎం సీటు కాపాడుకునేందుకు మాలల ఎదిగిన స్వార్థపరుల ఒత్తిడికి భయపడి.. అసెంబ్లీలో తన మాట్లాడిన మాటలకే విలువనివ్వకుండా సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం ఇచ్చిన ప్రతీ నోటిఫికేషన్‌ల్లో వర్గీకరణను అమలు చేసి మాదిగలకు న్యాయం చేస్తానని మాట తప్పి వేలాది ఉద్యోగాల ఫలితాలను ప్రకటించి మాదిగ నిరుద్యోగులకు నమర్మక ద్రోహం చేశారన్నారు. కార్యక్రమంలో ఇండ్ల ఎల్లన్న మాదిగ, సందూరి వినయ్ సాగర్ మాదిగ, ఆరేపల్లి గణేష్ మాదిగ, రోడ్డ గంగన్న, ప్రహ్లాద్, గణేష్, వినయ్, రాజు పాల్గొన్నారు.



దీక్షలో కూర్చున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం.. అధికారుల చోద్యం!

● ట్రిపుల్ ఐటీలో నిబంధనలు పాటించని వారిపై చర్యలు కరువు ● విద్యార్థులు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
● టెండరు జాప్యంపై అనేక అనుమానాలు ● అధికారులు మారినా మార్పు రాని తీరు

బాసర, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) :

యూనివర్సిటీ మార్ట్‌లో ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారని విద్యార్థులు కొన్నిరోజుల క్రితం క్యాంపస్‌కు వచ్చిన కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే మరోసారి ఇలా జరగకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. కానీ యూనివర్సిటీ అధికారులు మాత్రం అధిక ధరల కట్టడికి తనిఖీలు వంటి ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. దీంతో మళ్లీ తాజాగా మరోసారి ఫిర్యాదులు రావడంతో స్టూడెంట్ వెల్ఫేర్ విభాగ అధికారులు వెళ్లి విచారించి వచ్చారు తప్ప చర్యల్లేవు.

యూనివర్సిటీలో కాంట్రాక్ట్ పొందిన వివిధ సంస్థల్లో కార్మికులు పని చేస్తున్నారు. కానీ కొన్నిసంస్థలు నిబంధనల ప్రకారం కార్మికుల సంక్షేమం, వేతనాలు, దుస్తులు వంటివి ఇవ్వడం లేదు. పట్టించుకునేవారు లేకపోవడంతో కార్మికులు ముథోల్ ఎమ్మెల్యే రామరావు పటేల్‌కు కలిసి తమ గోడును విన్నవించుకున్నారు.

ఇదీ బాసర ట్రిపుల్ ఐటీలో పరిస్థితి. క్యాంపస్‌లో కాంట్రాక్టర్‌ల రాజ్యం నడుస్తోందనేందుకు ఇవి రెండు నిదర్శనం మాత్రమే. వారు చెప్పిందే వేదం అన్న చందంగా సాగుతోంది. పొందిన ఏడాది కాంట్రాక్ట్ గడువు కాకుండా అదనంగా మూడేళ్ల వరకు కొనసాగుతున్నారంటే వారి ప్రభల్యం ఎంతవరకు ఉందో ఇట్టే అర్థమవుతుంది. ప్రభుత్వాలు, అధికారులు మారినా వారు మాత్రం ఇక్కడ తిష్టవేశారు. గత ప్రభుత్వ హయంలో మంత్రి కేటీఆర్ క్యాంపస్‌ను సందర్శించిన సమయంలో మెస్ కాంట్రాక్టర్‌లపై విద్యార్థులు ఫిర్యాదు చేశారు. కాంట్రాక్ట్ గడువు ముగియడంతో వెంటనే టెండరు వేయాలని ఆదేశించారు. మళ్లీ వచ్చేసరికి టెండరు నిర్వహించకపోవడంపై యూనివర్సిటీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టెండర్లు ఎందుకు జాప్యం చేస్తున్నారు అదేమైన అంతర్జాతీయ సమస్యనా ఆలస్యం కావడానికంటూ అసహనం వ్యక్తం చేశారు. తాజాగా నెల రోజుల క్రితం జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్కకు యూనివర్సిటీ విద్యార్థులు భోజనం సరిగా ఉండడం లేదంటూ ఫిర్యాదుచేశారు. వెంటనే అధికారులు కాంట్రాక్ట్ ముగిసిన గడువు విషయాన్ని చెప్పడంతో టెండరు వేయాలని మంత్రి ఆదేశించారు. 3నెలలు కావస్తున్నా ఇంకా టెండర్లను మాత్రం అధికారులు ఆహ్వానించలేదు. ఇలా ప్రభుత్వ పెద్దలే ఆదేశించినా అధికారులు ఖాతరు చేయకపోవడం ఇక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది. 9వేల మంది విద్యార్థులు చదువుకుంటున్న విద్యాసంస్థలో అధికారుల తీరు విమర్శలకు తావిస్తోంది.

అధికారుల చోద్యం

యూనివర్సిటీలో పలు సంస్థలపై అనేక ఫిర్యాదులు ఉన్నాయి. మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని, ఒకవేళ పెట్టినా నాణ్యతగా ఉండడం లేదనే ఫిర్యాదులున్నాయి. గడిచిన మూడు, నాలుగేళ్లలో విద్యార్థులకు అందించే భోజనంలో పురుగులు, సాలెపురుగులు, కప్పలు వంటివి పలుమార్లు వచ్చాయి. ఫుడ్‌పాయిజన్ జరిగి వందలమంది ఆసుపత్రి పాలయ్యారు. కొంతమంది ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డారు. భోజనం బాగాలేదంటూ విద్యార్థులు రోజుల తరబడి నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కానీ అధికారులు మాత్రం చర్యలు తీసుకోలేదు. అప్పుడప్పుడు కంటి తుడుపుగా జరిమానాలు విధించి చేతులు దులుపుకుంటున్నారు. అదేవిధంగా యూని వర్సిటీలోని వివిధ విక్రయకేంద్రాల్లో అధిక దరలకు విక్రయిస్తున్నా పట్టించుకోవడం లేదు. వివిధ సంస్థల్లో కార్మికులకు నిబంధనల ప్రకారం వేతనాలు చెల్లించాల్సి ఉన్నా చెల్లించడం లేదు. కాంట్రాక్టర్‌కు పూర్తి స్థాయిలో యూనివర్సిటీ నుంచి డబ్బులు ముట్టజెప్పుతున్న కార్మికులకు నిబంధనల మేరకు రావాల్సిన వేతనాలు, బెనిఫిట్స్ అందడం లేదనే ఫిర్యాదులున్నాయి. ఈ విషయమై కార్మికులనుంచి ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు అందుతున్నాయి. ఏడాది కాంట్రాక్ట్ పొంది మూడేళ్లు అవుతున్నా కాంట్రాక్టర్‌లపై చర్యలు తీసుకునేందుకు పర్యవేక్షకులైన కిందిస్థాయి సిబ్బంది జంకుతున్నారు.


ట్రిపుల్ ఐటీ ప్రధాన ప్రవేశ ద్వారం

వీసీలు మారినా వారే కాంట్రాక్టర్‌లు..

గడిచిన ఐదేళ్లలో ముగ్గురు వీసీలు మారారు. ఇప్పుడు పనిచేస్తున్న వైస్ చాన్సలర్ 5నెలల నెలల క్రితమే వచ్చారు. అప్పటినుంచి ఇప్పటి వరకు ప్రైవేటు సంస్థలపై ఉన్నతాధికారుల వద్ద ఫిర్యాదులున్నాయి. యూనివర్సిటీ బాస్‌లు మారినా అందులో ఉన్న కాంట్రాక్టర్‌లు మాత్రం మారకపోవడం శోచనీయం. ఇలా అధికారులు ఎవరు వచ్చినా కాంట్రాక్టర్‌ల విషయంలో దృష్టి సారించలేకపోతున్నారనే విమర్శలున్నాయి. సాకులతో టెండర్లను వాయిదా వేస్తూ వారు జోలికి పోవడం లేదు. ఉన్నతాధికారులే ఇలా ఉంటే కింది స్థాయి సిబ్బంది పరిస్తితి మరీ దారుణం, కాంట్రాక్టర్లు చెప్పినట్లే నడుచుకోవాల్సిన పరిస్థితిఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

టెండరు జాప్యంపై అనుమానాలు

యూనివర్సిటీలో వివిధ కాంట్రాక్టు వ్యవస్థల గడువు ముగిసినా అధికారులు వారిని కొనసాగించడంపై అనేక అనుమానాలకు తావిస్తోంది. ఏళ్ల తరబడి వారికే కాంట్రాక్టును కట్టబెట్టడంపై అవినీతి ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. లోపాయికారి ఒప్పందాల వల్లే అధికారులు కాంట్రాక్టర్లకు వత్తాసు పలుకుతున్నారనే విమర్శలున్నాయి. కాంట్రాక్టు గడువు కంటే ముందే టెండరు ప్రక్రియ పూర్తిచేయాల్సి ఉంటుంది. దానికి ప్రత్యేకవిభాగం ఉన్నా ఉన్నతాధికారు ల జోక్యం వల్ల సంబంధిత విభాగ అధికారులు టెండరు ప్రక్రియను పూర్తిచేయడం లేదనేది స్పష్టమవుతోంది. ట్రిపుల్ ఐటీలో మొత్తం కాంట్రాక్ట్ వ్యవస్థల టర్నోవర్ రూ. 70కోట్ల వరకు ఉంటుంది. టెండరు ప్రక్రియ లేకుండా కాంట్రాక్టు గడువులు కొనసాగించడంపై రూ.కోట్లు చేతులు మారుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతీసారి అధికారులు గత రెండుమూడేళ్ల నుంచి త్వరలో టెండర్లు వేస్తామంటూ ప్రకటనలు ఇవ్వడంతప్ప చేసిందేమీలేదు. మధ్యలో అసెంబ్లీ, పార్ల మెంట్, ఎమ్మెల్సీ వంటి ఎన్నికల కోడ్‌లను కూడా వీరు కారణంగా చెబుతు న్నారు. ఒకటి రెండునెలలు అమలులో ఉండే ఎన్నికల కోడ్‌ను కారణంగా చూపుతూ కాంట్రాక్టర్ లకు వత్తాసు పలుకుతున్నారు. ఫిర్యాదులున్నప్పటికి చర్యలు తీసుకోకపోవడం అందరిని విస్మయానికి గురిచేస్తోంది. ఇటీవలే యూని వర్సిటీలో కొంతమంది విద్యార్థులు యూనివర్సిటీలో అందిస్తున్న భోజన వసతిపై ఆన్‌లైన్ సర్వే నిర్వహించగా సింహాభాగం విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ విషయాన్ని కూడా సదరు విద్యార్థులు యూనివర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితంలేదు. ఒక ప్రైవేటు వ్యవస్థ ఐదారేళ్ల పాటు దీర్ఘకాలంగా పనిచేస్తుంటే కింది స్థాయి సిబ్బంది, సంబంధిత పర్యవేక్షకులు విధుల పరంగా కఠినంగా వ్యవహరించలేకపోతున్నారనే అభిప్రాయాలున్నాయి.


మంత్రి సీతక్కకు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి (ఫైల్)

మళ్లీ అదే మాట ..

యూనివర్సిటీలో గడువు ముగిసినా కాంట్రాక్టర్‌ల విషయం వైస్‌చాన్సలర్, ప్రొఫెసర్ గోవర్ధన్ దృష్టికి 'ఆంధ్రజ్యోతి' తీసుకెళ్లగా త్వరలోనే టెండరు వేస్తామంటూ గతంలో చెప్పిన సమాధానమే ఇచ్చారు. సమాచార శాఖకు పంపిస్తామని, టెండరు నోటిఫికేషన్ త్వరలోనే విడుదలవుతుందని పాత విషయమే చెప్పుకొచ్చారు. టెండరు పిలిచే పనుల గురించి వివరాలను వెల్లడించలేదు. ఎప్పటిలాగే ఈసారి కూడా అధికారులు త్వరలో అంటూ సమాధానమిచ్చారు.

ఈతచెట్ల పెంపకంపై రైతుల ఆసక్తి

తాంసి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఈత చెట్ల పెంపకంపై రైతులు శ్రద్ధ చూపిస్తున్నారు. పొలం గట్టుపై ఉన్న ఈత మొలకలను పెంచుతున్నారు. మండలకేంద్రంతోపాటు గ్రామాల్లో చెట్ల పెంపకం పెరిగింది. గౌడ కులస్తులు తమవే అని అంటుండడంతో కొంతమంది రైతులు వాటిని తొలగిస్తున్నారు. పొలం గట్ల వద్ద ఉన్న చెట్లు సంబంధిత రైతుకు సంబంధిం చినవని రెవెన్యూ రికార్డులో పేర్కొంటున్నారు. దీనిపై రెవెన్యూశాఖ అధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉరి వేసుకొని విద్యార్థిని ఆత్మహత్య

భైంసా, మార్చి16 (ఆంధ్రజ్యోతి): భైంసా పట్టణంలోని ఫులేనగర్ కాలనీకి చెందిన ఓ విద్యార్థిని ఆదివారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కాలనీ పరిధిలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని కోమల్ కదం (14) సాయంత్రం వంటగదిపై కప్పుకు గల ఇనుప రాడ్‌కు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు యత్నించింది. దీన్ని గమనించిన ఆమె సోదరి కేకలు వేస్తూ బయటికొచ్చింది. సంబంధిత సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు, ఇంటిచుట్టూ పక్కన గల కొంతమంది వెళ్లిచూడగా అప్పటికి కోమల్ కొనఊపిరితో కనిపించింది. దీంతో వెంటనే మెడకు ఉన్న చీరను విప్పి ఆటోలో ఇక్కడి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి చేరేలోపు కోమల్ మృతిచెందింది. కాలనీ పరిధిలోని ఓ యువకుడి వేధింపులు కారణంగానే తమ కూతురు ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. భైంసా టౌన్ సీఐ గోపీనాథ్ ఘటనా స్థలిని పరిశీలించి ఆత్మహత్య ఘటనపై విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లుగా వెల్లడించారు.


కోమల్ కదం మృతదేహం


విచారణ జరుపుతున్న టౌన్ సీఐ గోపీనాథ్


బుద్ధ వందన కార్యక్రమానికి హాజరైన బౌద్ధులు

బుద్ధుని బోధనలు అనుసరణీయం

భైంసా, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మానవాళి మనుగడకు బుద్ధుని బోధనలు ఎంతో అనుసరణీయమని బౌద్ధ ఉపాసకుడు ఆకాష్ దగ్డే పేర్కొన్నారు. ఆదివారం భైంసాలోని బుద్ధ విహార్‌లో జరిగిన బుద్ధపూజ, బుద్ధ వందన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. శాంతి, సామరస్యానికి బుద్ధుని బోధనలను ప్రతీకలనీ వెల్లడించారు. బుద్ధుడు బోధించిన పంచశీల సూత్రాలను అనుసరించడం ద్వారా అన్నింటా సత్ఫలితాలుంటాయని తెలిపారు. తాత్విక బోధనలు, శాంతి, శీలం, సహనం అనే ధర్మాలతో సమాజంలో శాంతి స్థాపనకు గౌతం బుద్ధుడు అవిరళంగా కృషి చేసాడని తెలిపారు. ప్రతి ఒకరు సోదరభావంతో మెలుగుతూ సమాజ సేవకు తమవంతు బాధ్యతాయుత భాగస్వామ్యాన్ని అందించాలని సూచించారు. భైంసా బుద్ధ విహార్ టీం ఆధ్వర్యంలో నిర్వహించబడిన బుద్ధ పూజ, బుద్ధ వందన కార్యక్రమాలకు భైంసా పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి బౌద్ధ బంధువులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

గ్రూప్- 2, 3లో రాష్ట్రస్థాయి ర్యాంక్ సాధించిన శశి కుమార్‌కు అభినందన

కడెం, మార్చి16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నబెల్లాల్ గ్రామానికి చెందిన భూక్యా శశి కుమార్ నాయక్ గ్రూప్- 2, 3 ఫలితాల్లో ఎస్టీ విభాగం కిందరాష్ట్రస్థాయి మొదటిర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా శశికుమార్‌కు తెలంగాణ రాష్ట్ర బీసీ యూత్ అసోసియేషన్ తరఫున సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధానకార్యదర్శి వెంకట రమణ యాదవ్ పాల్గొన్నారు.

పేద గిరిజన యువతికి పుస్తె, మెట్టెల అందజేత

కడెం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గండి గోపాల్‌పూర్‌కు చెందిన ఎం.చంద్రశేఖర్-దేవక్కల కుమార్తె సుమలత వివాహానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురవడంతో ఉడుంపూర్ మాజీ సర్పంచ్ జొన్నల సావితి రాజయ్యగుప్తా, మాజీ ఎంపీటీసీ కాంగ్రెస్ నాయకులు జొన్న చంద్రశేఖర్ గుప్తా వివాహానికి హాజరై పెళ్లికుమార్తెకు పుస్తె, మెట్టెలు, చీర, గాజులను అందజేశారు.

చేపలు పట్టేందుకు వెళ్లి ఒకరి మృతి

సోన్, మార్చి16 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన గుమ్ముల సాయన్న(48) చేపలు పట్టడానికి వెళ్లి మృతిచెందాడు. శుక్రవారం సాయంత్రం సమయంలో ప్రతీరోజులాగే గోదావరి నీటిలో చేపలు పట్టడానికి వెళ్లివస్తానని చెప్పి ఇంట్లో చెప్పివెళ్లి ఇంటికి రాలేదు. శనివారం సాయంత్రం 6గంటల సమయంలో సోన్ పాత బ్రిడ్జి సమీపంలో ఒక నీటి మడుగులో సాయన్న మృతిచెంది కనిపించాడు. మృతుడి భార్య లింగవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

తానూర్, మార్చి16: (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం తానూర్‌లో ఆదివారం జరిగినరోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. కుబీర్ మండల కేంద్రానికి చెందిన సగ్గం నరేష్ (36) పని నిమిత్తం తానూర్‌కు వచ్చి తానూర్ సమీపంలోని దంగేపల్లి వంతెన వద్ద అదుపు తప్పి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ప్రమాదంలో ముందుకున్న ద్విచక్రవాహనంపై వెళ్తున్న హిప్నెల్లి తండాకు చెందిన సుజాత కుడికాలుకు గాయాలయ్యాయి. గాయాలపాలైన సుజాత అన్నయ్య పవార్ సతీష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అడవుల్లో చెలరేగుతున్న కార్చిచ్చు

● వారం రోజులుగా ఖానాపూర్ రేంజ్ పరిధిలో తగలబడుతున్న అడవులు ● రహదారులపై కమ్ముకుంటున్న దట్టమైన పొగ
● మంటలతో ఆగమవుతున్న వన్యప్రాణులు ● తప్పించుకునేందుకు పరుగులు పెడుతూ గుంతల్లో పడి ప్రాణాలు కోల్పోతున్న వైనం


ఖానాపూర్ మండలం రంగాపేట్ శివారులో వ్యాపిస్తున్న మంటలు


నిర్మల్, మంచిర్యాల రహదారిపై తర్లపాడ్ సమీపంలో కాలిబూడిదైన వృక్షాలు


కార్చిచ్చుతో వస్తున్న దట్టమైన పొగ

ఖానాపూర్, మార్చి16 (ఆంధ్రజ్యోతి): జింకలు, కుందేళ్లు, చుక్కల దుప్పులు, నీలుగాయిలు, కొండ గొర్రెల్లాంటి ఎన్నో రకాల శాఖాహార జంతువులు, ఎలుగుబంటి, చిరుత, హైనా, పెద్దపులి లాంటి మాంసాహార జంతువులతో పాటు ఎన్నో రకాల అందమైన పక్షులకు నిలయమైన ఖానాపూర్ ప్రాంత అడవుల్లో గత వారం రోజులుగా మంటలు చెలరేగుతున్నాయి. ఒకదగ్గర రాజుకున్న మంటలు క్రమేపి అడవంతా వ్యాపిస్తూ పచ్చని అడవులను బొగ్గులాగా మారుస్తున్నాయి. ఈ క్రమంలో ఇక్కడి అడవుల్లో తలదాచుకుంటున్న వన్యప్రాణులు మంటల తాకిడిని తట్టుకోలేక ఆగమవుతున్నాయి. ఎండిన ఆకులకు రాజుకున్న అగ్గి అడవుల్లో ఎండిన చెట్లను కట్టెలను కాలుస్తూ నలువైపుల నుంచి మంటలు వ్యాప్తిచెందడంతో ఆ అడవుల్లో ఆవాసం ఏర్పాటు చేసుకున్న వన్యప్రాణులు మంటల బారి నుంచి తమను తాము రక్షించుకునేందుకు పరుగులు పెడుతున్నాయి. ఈ క్రమంలో అడవులను అనుకొని ఉన్న చెరువులు, కుంటల వైపు పరుగులు పెట్టి ఉపశమనం పొందుతున్నాయి. ఈ మంటలు వేడిని తట్టుకునేందుకు పరుగులు పెట్టే క్రమంలో అడవుల్లోని కందకాలలో, కుంటల్లో, చెరువుల్లో పడి ప్రాణాలు కోల్పోతున్నాయని పలువురు చెబుతున్నారు. రెండురోజుల క్రితం ఖానాపూర్ మండలం తర్లపాడ్‌శివారులోని ఓ చెరువులో చుక్కల దుప్పి కళేబరం కనిపించింది. సదరు చుక్కల దుప్పిని కుక్కలు వెంబడిం చడంతో నీటి కుంటలో పడి చనిపోయిందని కొందరు, నీళ్ల తాగేందుకు వచ్చి అక్కడి గుంతల్లో పడి చనిపోయిందని మరికొందరు అధికారులు తెలిపారు. కానీ గత వారం రోజులుగా ఇక్కడి అడవుల్లో రాజుకుంటున్న మంటల నుండి ఉపశమనం పొందేందుకు చెరువువైపు పరుగులు తీస్తూ వచ్చిన సదరు చుక్కల దుప్పి నీటి గుంతలో పడి ప్రాణాలు కోల్పోయి ఉంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇలా అడవుల్లో చెలరేగుతున్న మంటలకు వన్యప్రాణులు గ్రామాల శివారులకు పరుగులు తీస్తే ఓవైపు వేటగాళ్లు, మరోవైపు వేట కుక్కలతో వాటి ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని వన్యప్రాణి ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక ఖానాపూర్ - నిర్మల్, నిర్మల్ - మంచిర్యాల, ఖానాపూర్ - ఎర్వచింతల్ రహదారులను ఆనుకుని మంటలు భారీగా చెలరేగుతుండడంతో రోడ్లపై భారీగా దట్టమైన పొగ అలుముకుంటోంది. ఈ పొగను దాటుకొని వాహనాలపై ప్రయాణించాలంటే ఊపిరి దిగబట్టాల్సిన పరిస్థితి నెలకొందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కిలోమీటర్ల తరబడి రహదారులపై కార్చిచ్చు పొగ కమ్ముకోవడంతో ఓవైపు ఊపిరి ఆడటం లేదని మరోవైపు కళ్లు మంటలేస్తున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై వెళ్లే ప్రయాణికుల పరిస్థితి ఇలా ఉంటే అడవుల్లో ఉండే వన్యప్రాణుల పరిస్థితి ఎలా ఉంటుందోనని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడవుల్లో మంటలను ఇకనైనా అదుపు చేయకపోతే పరిస్థితి మరింత తీవ్రతరంగా మారుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అడవుల్లో మంటలను నివారించేందుకు చేపడుతున్న చర్యలను మరింత ముమ్మరంగా నిర్వహించాలని మండల ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం వారం రోజులుగా ఖానాపూర్ మండల అడవుల్లో ఏదో ఒక ప్రాంతంలో కార్చిచ్చు రాజుకుంటున్న నేపథ్యంలో నివారణ చర్యలు ఏవిధంగా చేపడుతున్నారో తెలుసుకునేందుకు ఖానాపూర్ అటవీ రేంజ్ అధికారిని ఆంధ్రజ్యోతి సంప్రదించేందుకు పలుమార్లు ప్రయత్నించగా ఆయన ఫోన్ ఎత్తలేదు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

● డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు

నిర్మల్ రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు తెలిపారు. ఆదివారం మండలంలోని నీలాయిపేట గ్రామంలో 20 లక్షల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణపనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి, మాజీ ఎంపీపీ రామేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్‌లు సాయన్న, రాములు, భూమేష్, మాజీ వైస్ ఎంపీపీ గాండ్ల విలాస్, గ్రామ పార్టీ అధ్యక్షులు రవీందర్, నాయకులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన

ఆదిలాబాద్‌రూరల్, మార్చి16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీసరస్వతి శిశుమందిర్ 1992 - 93 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు కేరీర్ గైడెన్స్, కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం మహాలక్ష్మీవాడ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహనలో సబ్జెక్ట్ నిపుణులు పలు విషయాలను విద్యార్థులకు తెలిపారు. ఒత్తిడి లోనుకాకుండా పరీక్షలు ప్రశాంతంగా రాయాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు, పూర్వవిద్యార్థి ఎన్నాల నగేష్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో సామాజిక కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించామని తెలిపారు. ఇందులో భాగంగా తొలుత పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల్లో రాణించేల ప్రోత్సహించేందుకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఎలాంటి ఒత్తిడి, భయం లేకుండా పరీక్షలను రాసి మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆవుల మహేందర్, ఎన్నాల నగేష్, జైపాల్ రెడ్డి, కత్తురి కిరణ్ కుమార్, కన్నామి నగేష్, ముసుగు మహేందర్ పాల్గొన్నారు.

గిరిజనులను వెంటాడుతున్న పౌష్టికాహార లోపం

(5వ పేజీ తరువాయి...)

రక్తహీనతతో మరణాలు జరుగుతున్న వైద్య ఆరోగ్యశాఖ, మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులు ప్రజల్లో చైతన్యం కల్పించలేక పోతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో సేవలు అందిస్తున్న ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు ప్రజలకు అవగాహన కల్పించడంలో విఫలమవుతున్నారని గిరిజన ప్రాంతాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని కిందిస్థాయి సిబ్బందితో ప్రజలకు చైతన్యం కల్పించేలా చూడాలంటున్నారు.

● ఎన్ఆర్‌సీకి సిబ్బంది కొరత

ఉట్నూర్‌లోని జిల్లాకేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన పౌష్టిక ఆహార కేంద్రం, నవజాత శిశువుల కేంద్రాలకు కావాల్సినంత సిబ్బందిని నియమించడంలో జాతీయ ఆరోగ్య మిషన్ అధికారులు విఫలమైనట్లు తెలుస్తుంది. ఎన్‌హెచ్‌ఎం కింద పని చేసిన కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులకు రెగ్యూలర్ ఉద్యోగాలు రావడంతో వారు వెళ్లిపోగా ఉట్నూర్ జిల్లా కేంద్ర ఆసుపత్రిలోని కొంతమంది స్టాఫ్‌నర్సులకు అదనపు విధులు అప్పగించారు. ఎన్ఆర్‌సీతోపాటు, నవజాత శిశువు కేం ద్రంలో ఎనిమిదిమంది స్టాఫ్‌నర్సులు ఉండాల్సి ఉండగా నలుగురు మాత్రమే సేవలు అందిస్తున్నారు. దీంతో ఉన్న సిబ్బందిపై అదనపు భారంపడు తుందని తెలుస్తోంది. ఏజెన్సీ ప్రాంత ప్రజల కోసం ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలకు కావాల్సిన సిబ్బందిని నియమించి అంగన్వాడీ టీచర్లు, ఆశావర్కర్ల ద్వారా రక్తం లేమితో బాధపడుతున్న వారిని తరలిస్తే ఈ కేంద్రం ద్వారా వారికి సేవలు అందించే అవకాశాలు ఉన్నాయి.

● అలంకారప్రాయంగా అంగన్‌వాడీ కేంద్రాలు

గిరిజన గ్రామాలలోని చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య అందించడంతోపాటు సున్నా నుంచి నాలుగేళ్ల లోపు చిన్నారులకు పౌస్టికాహారం అందించడానికి ఏర్పాటుచేసిన అంగన్‌వాడీ కేంద్రాలు అలంకార ప్రాయంగా మారుతున్నాయన్న విమర్శలు వస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారులకు, గర్భిణీలకు, బాలింతలకు సేవలు అందించాల్సి ఉంటుంది. కానీ కొంతమంది అంగన్‌వాడీ టీచర్లు స్థానికంగా ఉండకపోవడం వల్ల ఆయాలపై భారం పడుతుండడంతో ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలు కావడంలేదని తెలుస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలను తరుచూ పర్యవేక్షించాల్సిన సిబ్బంది కూడా అంతంత మాత్రమే పర్యవేక్షణ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అవుతున్న గుడ్లు కొందరు అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కోడిగుడ్లను సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లు సైతం సరైన పద్ధతిలో గుడ్లు సరఫరా చేయడంలేదని అయినప్పటికీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలలోని టీచర్లు, ఆయాలు కొందరు పదవి విరమణ చేసినప్పటికీ వారి స్థానంలో కొత్త వారిని నియమించక పోవడంతో ఆయా గిరిజన గ్రామాలలో అంగన్‌వాడీల సేవలు నిలిచి పోయినట్లు తెలుస్తోంది. ఉట్నూర్ మండలంలోని మోతిరామ్‌గూడ, పిట్టగూడ గ్రామాలలో ఆయాలు లేకపోవడంతో సేవలు అందడం లేదని తెలుస్తోంది. ఇప్పటికైనా ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు మెరుగైన సేవలు అందేలా జిల్లా అధికారులు స్పందించాలని గిరిజన ప్రాంతాల పలు కోరుతున్నారు.

రక్తలేమికి వైద్యం అందుకుంటున్నా..

● చంద్రకళ, అల్లిగూడ, సిర్పూర్ యూ మండలం



ఉట్నూర్‌లోని జిల్లా ఆసుపత్రిలో ఉన్న నవజాత శిశు కేంద్రం, పౌష్టిక ఆహార కేంద్రం ద్వారా సేవలు అందుకోవడానికి చేరాను. పుట్టిన ఆరు రోజుల బాబుకు వైద్యం అందించడంతో పాటు తాను కూడా రక్తలేమిని అధిగమించడానికి వైద్యం అందుకుంటున్నాను.

బాబుకు పచ్చకామెర్ల వ్యాధి

● రాథోడ్ సవిత, పులిమడుగు



తమ రెండున్నర ఏళ్ల బాబు పచ్చకామెర్ల వ్యాధితో బాధపడుతున్నందున ఎన్ఆర్‌సీలో చేర్పించి వైద్య సేవలు అందిస్తున్నాను. బాబుకు రక్తహీనత కూడా ఉంది.

ఎన్ఆర్‌సీకి వచ్చిన వారికి సంపూర్ణ వైద్య సేవలు

● రాహుఫ్, వైద్యులు



ప్రభుత్వ ఆసుపత్రిలోని ఎన్ఆర్‌సీకి, నవజాత శిశువు కేంద్రానికి వ స్తున్న ప్రజలకు సంపూర్ణ వైద్య సేవలు అందిస్తున్నాం. చిన్నారులు శ్వాస కోస వ్యాధులతో పాటు, రక్తహీనత, తదితర వ్యాధులతో బాధపడే వారికి వైద్యం అందిస్తున్నాం. ఆసుపత్రిలో ప్రసవాలు జరిగినప్పుడు నవజాత శిశువులను ఇంక్యూబ్లేటర్లలో ఉంచుతున్నాం. కేంద్రంలో చేరిన వారికి 14 రోజుల పాటు చికిత్సలు అందిస్తున్నాం.

'అంగన్‌వాడీ భవనం మంజూరు చేయండి'

నార్నూర్, మార్చి16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో అంగన్‌వాడీ భవనం మంజూరు చేసి చిన్నారులకు విద్య, వైద్య, ఇతర సేవలు అందేలా ప్రభుత్వం వెంటనే పనులు ప్రారంభిచాలని కాలనీవాసులు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఈ సందర్భంగా జాడే నాందేవ్ మాట్లాడుతూ నార్నూర్ మండల కేంద్రంలో మొదటిసెంటర్ ఇది ఇక్కడ భవనానికి స్థలం ఉన్న అధికారులు నిర్లక్ష్యంచిన్నారులకు శాపంగా మారిందని, భవనాన్ని మంజూరు చేసి సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ గురించి సీఎం మాట్లాడడంపై కాంగ్రెస్ నాయకుల హర్షం

నార్నూర్, మార్చి16 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్‌కు ఎన్నో సంవత్సరాల నుంచి ఎయిర్‌పోర్ట్ కావాలన్న ప్రజల డిమాండ్‌పై అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రంతో మాట్లాడి ఆదిలాబాద్‌కు తీసుకువచ్చే బాధ్యత తనదని మాట్లాడడంపై ఉమ్మడి మండలంలోని కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా పార్టీ ఆదిలాబాద్ జిల్లా నాయకుడు వసంత్ ఆడె ఆదివారం మండలకేంద్రంలో మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ఆదిలాబాద్‌కు ఎయిర్‌పోర్ట్ మంజూరు కోసం ఎన్నో ప్రయత్నాలు జరిగినా ఇప్పటివరకు అనుమతులు లేక నిరాశకు గురైన జిల్లా ప్రజలకు అండదండగా నిలుస్తూ సీఎం రేవంత్‌రెడ్డి మంజూరు విషయంలో తగ్గేదే లేదనడం సంతోషకరమని అన్నారు. జిల్లా అభివృద్ధి కోసం తనవంతు ముందుండి ప్రణాళిక సిద్ధం చేస్తూ జిల్లా రూపురేఖలను మార్చే విధంగా చేస్తున్న ప్రయత్నం జిల్లా ప్రజలకు గర్వ కారణంగా ఉందని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు, చవాన్ ప్రకాష్, కోరెల మహేందర్, గుంజ చిన్న పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బీజేపీ నాయకుల పరామర్శ

సారంగాపూర్, మార్చి16 (ఆంధ్రజ్యోతి): మండలంలో గల జామ్ గ్రామానికి చెందిన కరిపే శంకర్ ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులైన కరిపే విలాస్‌ను ఆదివారం బీజేపీ నాయకులు సత్యనారాయణగౌడ్, చిన్నోళ్ల రాజారెడ్డి, రామ్‌రెడ్డిలు పరామర్శించారు. మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులకు అడిగి తెలుసుకుని మనోధైర్యాన్ని కల్పించారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

ఒకే దేశం-ఒకే ఎన్నికపై బీజేపీ కార్యశాల

నిర్మల్ కల్చరల్, మార్చి16 (ఆంధ్రజ్యోతి): ఒకే దేశం - ఒకే ఎన్నికపై ఆదివారం నిర్మల్ జిల్లాకేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో కార్యశాల నిర్వహించారు. కార్యశాల నిర్వహణ జిల్లా కన్వీనర్ అచ్యుత్ రావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలో ఒకే ఎన్నిక నిర్వహణతో వ్యయం తగ్గి నిరంతర అభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నిక విధానాన్ని గ్రామస్థాయిలో ప్రచారం చేసి ప్రజలను చైతన్య పర్చాలని పిలుపునిచ్చారు. 2029లో కేంద్ర ప్రభుత్వం ఒకే దేశం - ఒకే ఎన్నిక నిర్వహించే ఆలోచనలో ఉన్నట్టు తెలిపారు. నాయకులు రావుల రాంనాథ్, పి. గంగాధర్, చిన్నారెడ్డి, రవీందర్ రెడ్డి, సతీష్ రావు, శ్రీనివాస్, అశోక్, సాయినాథ్‌తో పాటు మండల కన్వీనర్లు, అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.


చెట్టు కొమ్మల పై ఆకుల వల్లే ఉన్న పక్షులు

బోసిపోయిన చెట్టుకు ప్రాణమిచ్చిన పక్షులు

తీక్షనంగా పరిశీలిస్తే ప్రకృతిలో ప్రతి ఒక్కటి విచిత్రమే.ఆకులు, కొమ్మలతో అందంగా కనిపించాల్సిన చెట్టుఆకులు రాలిపోవడంతో చెట్టుకు తిరిగి అందం తీసుకుని వద్దా మను కున్నాయేమో అక్కడే ఉన్న పక్షులన్నీ ఆకుల మాదిరిగా కూర్చున్నాయి. ఇచ్చోడ హైవే మీదుగా కనిపించిన ఈ దృశ్యం ప్రకృతి ప్రేమికుల మనసు దోచుకుంది.

● (ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్)


దేవాపూర్ పాఠశాలలో అసంపూర్తిగా మరుగుదొడ్ల నిర్మాణ పనులు


అసంపూర్తిగా ఉన్న వంటశాల నిర్మాణ పనులు

దేవాపూర్ పాఠశాలలో అసంపూర్తిగా 'మన ఊరు - మన బడి' పనులు

● పట్టించుకోని అధికారులు ● పత్తాలేని కాంట్రాక్టర్ ● అసంపూర్తిగా మరుగుదొడ్ల నిర్మాణంతో విద్యార్థులకు తప్పని తిప్పలు

తలమడుగు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవపూర్ పాఠశాలలో అసంపూర్తిగా మన ఊరు మనబడి పనులు నిలిచిపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో సదర్ కాంట్రాక్టర్ పత్తలేకుండా పోయారని గ్రామస్థులు ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో దేవపూర్ పాఠశాలను అన్ని రంగాల్లో అభివృద్ధిపరిచేందుకు మన ఊరు - మన బడి పథకం కింద దాదాపు 30 లక్షల రూపాయలను మంజూరు చేయగా అధికారులు కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించి అసంపూర్తిగా వది లేయడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా అ సంపూర్తిగా ఉన్న మరుగు దొడ్ల నిర్మాణంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు ఒంటికి.. రెంటికి ఇంటికి పోవలసిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని విద్యార్థులు వాపోయారు. అదేవిధంగా వంట షెడ్డు నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో మధ్యాహ్న భోజన కార్మికులు ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ విషయమై సంబంధిత శాఖ అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదన్నారు. అంతేకాక వంట షెడ్డులో మట్టి ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు వర్షాకాలంలో వంట చేయడానికి ఎంతో కష్టపడవల పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు. అదేవిధంగా ప్రహరీఅసంపూర్తిగా ఉన్నాయని గ్రామస్థులు తెలిపారు. ఇకనైనా అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


రబీ పంటలు సాగు చేస్తున్న రైతుల పంటల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న వ్యవసాయ అధికారులు

రబీలో పెరిగిన పంట సాగు


● ఉచిత విద్యుత్‌తో పంటల సాగుపై రైతుల ఆసక్తి

తలమడుగు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం సాగు చేసే రైతులు వర్షధార పంటలపై ఆధారపడకుండా సాగునీటి వసతి కలిగిన రైతులు మండలంలో జోరుగా రబీ పంటను సాగు చేస్తున్నారు. దీనికి తోడు ప్రభుత్వం రైతులకు ఉచిత విద్యుత్ అందించడంతో మరింత రైతులు పంటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. మండలంలో గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం రైతుల సంఖ్య పెరిగిందని మండల వ్యవసాయ అధికారి ప్రమోద్ రెడ్డి తెలిపారు. గత సంవత్సరం మండలంలో వివిధ రబీ పంటలు సాగు చేస్తున్న రైతుల సంఖ్య 7,500 ఉండగా ఈ సంవత్సరం 12 వేలకు పైగా రైతుల సంఖ్య పెరిగిందన్నారు. ఎక్కువ మంది రైతులు జొన్న పంట సాగు చేస్తున్నారు. మండలంలో దాదాపు 9 వేల మంది రైతులు జొన్న పంటను సాగు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఎక్కువమంది రైతులు కజ్జర్ల, దేవాపూర్, బరంపూర్, తలమడుగు, కుచులాపూర్, సుంకిడి, డోర్లీ, జరీ తదితర గ్రామంలోని రైతులు రబీ పంటలు సాగు చేస్తున్నారన్నారు. అంతేకాకుండా ఈ సంవత్సరం దాదాపు 2,500 మంది రైతులు శనగ పంటను సాగు చేస్తున్నారని. కొంతమంది రైతులు శనగ పంట సాగు చేయడం జరిగిందని, మరి కొంతమంది రైతులు పంటలను విక్రయించుకున్నారన్నారు. వీటితో పాటు వేరుశనగ, మక్కా. పసుపు, ఇతర పప్పు దినుసుల పంటలు రబీలో సాగు చేస్తున్నారన్నారు. కాగా వర్షాలు ఆగస్టు మాసం నుంచి బందు కావడంతో కొంత భూగర్భ జలాలు అడుగంటాయని, వీటిని దృష్టిలో పెట్టుకొని రైతు సోదరులు పంటల సాగు చేయాలని ఆయన సూచించారు. అంతేకాకుండా పంటల సాగులో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా సంబంధిత వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. కజ్జర్ల శివారు ప్రాంతంలోని రైతులు మూడు పంటలు సాగు చేస్తున్నారన్నారు. ముఖ్యంగా రబి పంటలు సాగు చేస్తున్న రైతులకు ఎరువుల కొరత లేకుండా సహకార సంఘాల ద్వారా అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు.


రైతులకు సలహాలిస్తున్న వ్యవసాయ అధికారులు

చేపల కోసం వేటాడుతున్న కొంగలు

ముథోల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఈయేడు మార్చి మొదటి వారం నుంచి ఎండలు మెండుగా కాస్తున్నాయి. దీంతో భూగర్భ జలాలు సైతం అడుగంటి పోతున్నాయి. అలాగే ఈ ఎండల కారణంగా మండలంలోని ఆయా గ్రామాల్లో గల చెరువులు సైతం ఎండు ముఖం పడుతు న్నాయి. అయితే చెరువులలో నీరు తగ్గి పోవడంతో కొంగలు చేపలు వేటాడేందుకు చేరుతున్నాయి. గుంపులుగా కొంగలు చెరువులలో చేపల కోసం వేటాడుతున్నాయి. మండలంలోని చించాల గ్రామంలో గల పెద్ద చెరువులో కొంగల గుంపు చేరుకొని చేపలు వేటాడే దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి తన కెమెరాలో బంధించింది.


చేపలను వేటాడుతున్న కొంగలు


ఎండ తీవ్రతకు నిర్మానుషంగా కనిపిస్తున్న ఎన్టీఆర్ చౌక్

భానుడి భగ భగలు

● ఆదిలాబాద్ జిల్లాలో 40.8 డిగ్రీల ఉష్ణోగ్రతల నమోదు

● ఎండల తీవ్రతకు ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు

ఆదిలాబాద్‌అర్బన్, మార్చి16 (ఆంధ్రజ్యోతి) ఆదిలాబాద్ జిల్లాలో 41 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోద వుతున్నాయి. అత్యధికంగా రికార్డు స్థాయిలో పగటి ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఈ సీజన్‌లో ఇదే మొదటి సారి. ఉదయం నుంచే భానుడి భగభగలకు పగటి ఉష్ణోగ్రతలు అమాంతంగా పెరిగి పోతు న్నాయి. ఇప్పుడే ఎండలు మండి పోతుంటే వచ్చే ఏప్రిల్, మే మాసాలలో పరిస్థితులు ఎలా ఉంటాయోనని జనం బెంబేలెత్తిపోతున్నారు. ఆదివారం ఆదిలా బాద్ జిల్లా గరిష్ట ఉష్ణోగ్రతలు 40.8 డిగ్రీలు కాగా ,కనిష్ట ఉష్ణోగ్రతలు 24.0డిగ్రీలుగా నమోదయ్యాయి. తీ వ్రమైన ఎండలతో మిట్టమధ్యాహ్నం జనం బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. ఈ యేడు మరిం తగా ఎండల తీవ్రత ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు. మండుతున్న ఎండల దాటికి చిరు వ్యాపారులు, రైతు, ఉపాధి కూలీలు సతమతమవుతున్నారు. సాయంత్రం 6 దాటితే కాని బయటకు వెళ్లే పరిస్థితులు కనిపించడం లేదు.


స్కార్ఫ్ ధరించి ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మహిళ

బుద్ధుడి బోధనలు అనుసరిద్దాం

● ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్

భక్తి


బుద్ధుడి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువస్తున్న కమిటీ సభ్యులు


జామిడి నుంచి భారీ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


ఇచ్చోడ, మార్చి, 16 (ఆంధ్రజ్యోతి) : బుద్ధుడి బోధనలు అనుసరిద్దామని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్ అన్నారు. ఆదివారం ఇచ్చోడ మండల కేంద్రంలోని సమతానగర్‌లోని బుద్ధ విహార్‌లో బుద్ధుడి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బుద్ధుడి ఆశయాలను, శాంతి మార్గాలను పాటిస్తే లోక కల్యాణార్థం జరుగుతుందని పేర్కొన్నారు. భారతదేశంలో బుద్ధుడు పుట్టినప్పటికీ ప్రపంచదేశాలన్నీ భౌద్ద మార్గాన్ని అనుసరిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని జామిడి గ్రామం నుంచి ఇచ్చోడ వరకు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఇచ్చోడలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి బుద్ధుడి విగ్రహాన్ని బుద్ధ విహార్‌కు తరలించి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంబేద్కర్, బుద్ధుడి మార్గాలను అనుసరిస్తున్న పరి వర్తకులకు పలువురికి సన్మానాలు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లాతో పాటు మహారాష్ట్ర నుంచి భౌద్ద ఉపాసకులు, అంబేద్కర్ వాదులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. మహా రాష్ట్రలోని ప్రముఖ గాయకులతో కవ్వాలి కార్యక్రమాన్ని సైతం ఏర్పా టుచేసి అంబేద్కర్, బుద్ధుడి జీవిత చరిత్రలను వివరించారు.

మండుటెండలతో విలవిలలాడుతున్న మూగజీవాలు


చెట్టు కింద సేద తీరుతున్న మూగజీవాలు

భైంసా, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు పెరుగుతున్న ఉదయ భానుడి ఉధృతితో మూగజీవాలు విలవిలలాడుతున్నాయి. మండుటెండల దాటికి తట్టుకోలేక పశుజాతి పాట్లు పడుతున్నాయి. మేతకు వెళ్లిన పశువులకు సక్రమంగా గ్రాసం దొరకడం లేదు. దీంతో పశువులు అర్ధాకలితో అలమటిస్తున్నాయి. కనీసం నీటితోనైనా కడుపు నింపుకుందామంటే వాటికి నీరు సైతం లభ్యం కావడం లేదు. మధ్యాహ్నం వేళలో మేతకు వెళ్లిన పశువులు సూర్యుడి ప్రతాపానికి బెంబేలు పడిపోయి ఆయా ప్రాంతాల్లో గల చెట్లను అశ్రయిస్తున్నాయి. మండుటెండల దాటితో జనాలతో పాటు మూగజీవాలు విలవిలలాడుతున్నాయి. పశువుల కాపరులకు పశుపోషణ భారంగా మారుతోంది. పశువులకు నీటిని, మేతను అందించేందుకు ఇబ్బందులు కావడంతో పశువులకు విక్రయించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ప్రమాదాలకు నిలయంగా స్పీడ్ బ్రేకర్లు


చించోలి(బి) రోడ్డులో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు

సారంగాపూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాం,ధని, చించోలి(బి), ఆలూర్ ఎక్స్ రోడ్డు సమీపంలో నిర్మల్, స్వర్ణ రహదారిపై అధికంగా స్పీడ్ బ్రేకర్లు వేయడంతో వాహనాలకు ప్రమాదంగా మారాయని వాహన చోదకులు పేర్కొంటున్నారు. ఈ రహదారిపై ఈ గ్రామాల మధ్యలోనే సుమారు 10 స్పీడ్ బ్రేకర్లు వేశారని దీంతో వాహనాలకు ప్రమాదాలు జరుగుతున్నాయంటున్నారు. ఇతర ప్రాంతాల నుంచి అడెల్లి మహా పోచమ్మ ఆలయానికి మొక్కులు తీర్చుకోవడానికి వచ్చే భక్తులకు స్పీడ్ బ్రేకర్ల వద్ద ఎలాంటి సూచిక బోర్డులను ఏర్పాటు చేయక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అలాగే చించోలిలో రోడ్డు ఇరుకుగా ఉండడంతో ఇతర పనుల కోసం వాహనాలపై ప్రతి రోజు ఉదయం 9, సాయంత్రం 5 గంటలసమయంలో ఈ రహదారులపై పశువులు, వాహనాలు అదికంగా వెళ్లడంతో ఇబ్బందులను ఎదుర్కొంటు న్నామని ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పీడ్ బ్రేకర్ల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని వాహన చోదకులు పేర్కొంటున్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

● మాజీ మంత్రి జోగు రామన్న


ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్ అర్బన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మ సంస్కృతి, సాంప్రదాయాలను పాటిస్తూ భావితరాలకు వాటి విశిష్టతను చెప్పాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగురామన్న అన్నారు. ఆదివారం పట్టణంలోని రణదివ్యనగర్‌లో నూతనంగా నిర్మించనున్న శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంకు భూమిపూజ చేశారు. అనంతరం గనపతిపూజ, పుణ్యాహవచ నం, నవగ్రహా ఆరాధన, పుష్పరచన, హోమాది క్రతువులను నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ కా లనీ వాసులంతా ఐక్యంగా ఉంటూ ఆలయ నిర్మాణానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరు చెడు అలవాట్లను వీడనాడి సన్మార్గంలో పయనించాలని తద్వారా మెరుగైన సమాజ నిర్మాణానికి పాటు పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇజ్జగిరి నారాయణ, కోవారవి, దమ్మపాల్, కొండగణేష్, నల్ల మహేందర్, రామేశ్వర్, చిందం శివకుమార్ పాల్గొన్నారు.

మండు వేసవిలో.. నిండు పచ్చదనం!

ఫొటో న్యూస్

సాధారణంగా అడవుల జిల్లా ఆదిలాబాద్ అంటేనే హరిత వర్ణశోభతో విలసిల్లే ప్రాంతం. అయితే ప్రస్తుతం వేసవి ఎండలు తీవ్రతరమవుతున్నాయి. అయినా ఉమ్మడి జిల్లాలోని గిరి పల్లెలు మాత్రం నిండు పచ్చదనంతో ఆకుపచ్చ తివాచి పరిచినట్టుగా ఆహ్లాద పరుస్తున్నాయి. ఆదిలాబాద్ సరిహద్దు ప్రాంతమైన నిర్మల్ మహబూబ్‌ఘాట్ ప్రాంతంలోని సోనాపూర్, గోపాల్‌పేట్‌తాండ, చించోలిబి, డ్యాంగాపర్, ఆదిలాబాద్ జిల్లా కుప్టి, మన్నూర్, కజ్జర్ల తదితర గిరిపల్లెల్లో కనుచూపు మేర పచ్చదనం వెల్లి విరుస్తుంది. అక్కడి పాడి పంటలు, పచ్చిక మైదానాలు హరితవర్ణ శోభతో ఆహ్లాద వాతావరణం కనిపిస్తుంది. మండువేసవిలో నిండు పచ్చదనంతో కనిపిస్తున్న ఈ పల్లెల మీదుగా ప్రయాణించే ప్రకృతి ప్రేమికులను మంత్ర ముగ్ధుల్ని చేస్తున్న దృశ్యాలు.


● (ఆదిలాబాద్, ఆంధ్రజ్యోతి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్)

సారంగాపూర్ మండలం చించోలి బి వద్ద పచ్చదనంతో కనిపిస్తున్న దృశ్యం



మన్నూర్ గ్రామం


కుప్టి గ్రామం


మహబూబ్‌ఘాట్ కింద పచ్చదనంతో కనిపిస్తున్న గ్రామాలు

పచ్చదనంతో కనిపిస్తున్న డ్యాంగాపూర్ గ్రామం


రిజర్వేషన్ రోస్టర్ జాబితా చూసుకోండి




- ఇచ్చిన డబ్బులు వసూలు చేసుకోండి!
- ఎట్టకేలకు వైద్య ఆరోగ్య శాఖ రోస్టర్ విడుదల
- కదిలించిన 'ఆంధ్రజ్యోతి' కథనం
- కలెక్టర్ కన్నెర్రతో అధికారుల్లో వణుకు
- వల నుంచి ఎలా బయటపడాలోనన్న ఆందోళనలో దళారీ ఉద్యోగి?

నిర్మల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో దళారీ అవతారమెత్తిన ఓ ఉద్యోగి.. ఆ శాఖను భ్రష్టు పట్టిస్తున్నాడన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. డీఎంఅండ్‌హెచ్‌వోతో సహా కార్యాలయంలో పలువురికి అవినీతి మరక అంటడానికి ఆ ఉద్యోగి పాల్పడిన అవినీతి అక్రమాలే కారణమన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. న్యాయబద్ధంగా రిజర్వేషన్‌ల ప్రకారం ఉద్యోగాలు పొందిన వారిని గుర్తించి పరోక్షంగా వారికి సమాచారం ఇచ్చి అభ్యర్థుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసిన ఆరోపణలు పెద్దమొత్తంలో వచ్చిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన 'రిజర్వేషన్ రోస్టర్ దాచి.. రూ.కోటి దోచే ప్లాన్' కథనం తీవ్ర కలకలం సృష్టించింది. అమాయక అభ్యర్థుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేసిన కార్యాలయ ఉద్యోగి ఒకరు ఇప్పుడు తీవ్రంగా ఆందోళన చెందుతున్నట్లు తెలిసింది. కలెక్టర్ సీరియస్ అయిన నేపథ్యంలో డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రాజేందర్ స్పందించి కొంతకాలంగా గోప్యంగా ఉంచిన రిజర్వేషన్ రోస్టర్ జాబితాను ఎట్టకేలకు డిస్‌ప్లే చేశారు. దీంతో డబ్బులు వసూలు చేసిన వారిలో ఆందోళన మొదలైంది.

మెక్కిన డబ్బులు కక్కాల్సిందే..

జిల్లా వైద్యారోగ్య శాఖలో గత ఏడాది నాలుగు నోటిఫికేషన్‌లు విడుదలయ్యాయి. 15ఎంఎల్‌హెచ్‌పీలు, 05 ఆర్‌బీఎస్‌కె మెడికల్ ఆఫీసర్‌లు, 06 ఏఎన్‌ఎంలు, 09 స్టాఫ్ నర్సులతో సహా డేటా ఎంట్రీ ఆపరేటర్, డీపీవో, రిఫ్రిజిరేటర్ మెకానిక్, సైకాలజిస్ట్‌లతో పాటు తదితర పోస్టులకు నోటిఫికేషన్‌లు వచ్చాయి. ఈ నోటిఫికేషన్‌ల ప్రకారం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇక్కడే కార్యాలయ ఉద్యోగి ఒకరు జిల్లాస్థాయి అధికారులకు డబ్బులు ఇస్తే ఖచ్చితంగా ఉద్యోగం ఇచ్చి పెడతానంటూ నమ్మబలికి డబ్బుల వసూలుకు తెరలేపినట్లు ఆరోపణలున్నాయి. తాజాగా 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంతో అర్హులైన వారి నుంచి అన్యాయంగా డబ్బులు వసూలు చేశారన్న విషయం బయటకు తెలడంతో తిన్న డబ్బులు ఇప్పుడు కక్కే పరిస్థితి నెలకొంది. ఇంతకాలం రిజర్వేషన్ రోస్టర్ జాబితా తెలియక తమకు న్యాయబద్ధంగా అర్హత సాధించినప్పటికీ అన్యాయంగా డబ్బులు ఇచ్చిన అభ్యర్థులు తాజాగా విడుదల చేసిన రిజర్వేషన్ రోస్టర్ ప్రకారం తమకు ఆర్‌ఓఆర్ ప్రకారమే ఉద్యోగాలు వచ్చాయని ఇందులో పైరవీ ఏమి లేకుండా డబ్బులు పోగొట్టుకున్నామని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నట్లు తెలిసింది. డబ్బులు ఇచ్చిన అభ్యర్థులను ఇప్పుడు కార్యాలయ ఉద్యోగి సహా ఓ అధికారి సముదాయించే ప్రయత్నం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ప్రొవిజనల్ జాబితా ప్రకటించిన నేపథ్యంలో ఓపె న్ కేటగిరిలో ఉన్నవారు ఎవరో ఇప్పటికే తేలిపోయింది. ఇక రిజర్వేషన్‌ల జాబితా లేక ఇంతకాలం ఎవరికి ఉద్యోగం వస్తుందో ఎవరికి రాదో తేలలేదు. తాజాగా జాబితా ప్రకటించడంతో ఎవరికి ఉద్యోగం వస్తుందో స్పష్టత వచ్చేసింది. ఉద్యోగాలు అర్హత పొందిన మార్కులు, రోల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారమే వచ్చినప్పటికీ తామేదో పైరవీలు చేసి ఉద్యోగాలు ఇప్పిస్తున్నట్లు నమ్మబలికి డబ్బులు వసూలు చేసిన కార్యాలయ ఉద్యోగి అధికారుల్లో కలవరం మొదలైంది. అన్యాయంగా డబ్బులు ఇచ్చిన అభ్యర్థులు వారి బంధువులు డబ్బులు తీసుకున్న వారి పై ఒత్తిడి పెంచే ప్రయత్నాల్లో ఉన్నారని సమాచారం. ఒకవేళ డబ్బులు ఇచ్చిన వారంతా కలెక్టర్ వద్దకు వెళితే జరిగిన అక్రమ వసూళ్ల వ్యవహారం తేలడంతో పాటు అక్రమాలకు పాల్పడిన డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయ ఉద్యోగులు తమ ఉద్యోగాలకు ఎసరు వస్తుందన్న భయంలో పడినట్లు తెలుస్తోంది. దీనిపై కొందరు హైదరాబాద్ స్థాయిలోనూ ఫిర్యాదులు చేసినట్లు సమాచారం.



Notification No. 01/ DMHO/2024, Dt. 23.02.2024

Post: MLHPs. No. Of Vacancies : 15

Category	OC	OC (W)	BC - A (W)	BC - B (W)	BC - C	BC - D (W)	BC - E (W)	SC	ST	ST (W)	EWS	EWS (W)	VH (W)
No. Of Vacancies	2	1	1	1	1	1	1	2	1	1	1	1	1

Notification No. 03/2023, Dt. 10.08.2023

Post Name Medical Officer - AYUSH (Male), RBSK

No. Of Vacancies : 02

Category	BC - A	SW
No. Of Vacancies	1	1

Post Name Medical Officer - AYUSH (Female), RBSK

No. Of Vacancies : 02

Category	ST	VH
No. Of Vacancies	1	1

Post Name: Pharmacist (RBSK)

No. Of Vacancies : 01

Category	OC
No. Of Vacancies	1

Note:- If any candidate is not available for appointment against the Roster point notified, appointment will be considered at next roster point

District Medical & Health Officer Nirmal

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి విడుదల చేసిన రిజర్వేషన్ రోస్టర్ జాబితా

డబ్బులు తిరిగి ఇస్తేనే ముప్పు నుంచి బయటకు

రిజర్వేషన్ రోస్టర్ ప్రకటించకుండా అర్హత సాధించిన అభ్యర్థుల నుంచి జాబితాను దాచి అక్రమంగా డబ్బులు వసూలు చేసినట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఎవరి నుంచైతే అక్రమంగా డబ్బులు వసూలు చేశారో వారికి తిరిగి ఇస్తే గానీ ఈ వ్యవహారం సద్దుమణిగే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికే కొందరు బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాలు ఈ వ్యవహారంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. అక్రమంగా వసూలు చేసిన డబ్బులు తిరిగి చెల్లిస్తే గానీ తాము కూడా ఈ ముప్పు బయట పడలేమని కార్యాలయ ఉద్యోగులు సమావేశం పెట్టుకొని ఒక నిర్ణయానికి వచ్చినట్లు కూడా చెబుతున్నారు. ఇదిలా ఉంటే కలెక్టర్ ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్నందు వల్లనే ఆర్‌ఓఆర్ జాబితా బయట పడిందని అభ్యర్థులు అభిప్రాయపడుతున్నారు.

నేరుగా సంప్రదించండి : కలెక్టర్

ఇదిలాఉంటే ఇంకా ఏమైనా అక్రమాలు అవినీతి వ్యవహారాలు ఉన్నట్లయితే నేరుగా తమకు ఫిర్యాదు చేయాలని కలెక్టర్ తన మెయిల్ ఐడీని డీఎం అండ్ హెచ్‌వో జారీ చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నియామకాల ప్రక్రియలో అవినీతిని సహించబోమని స్పష్టం చేశారు. నేరుగా అభ్యర్థులు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. దీంతో డబ్బులు వసూలు చేసిన అక్రమార్కుల్లో వణుకు మొదలైనట్లు చెబుతున్నారు.

నిర్మల్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు బస్సు:డీఎం

నిర్మల్ కల్చరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ డిపో నుంచి ఖానాపూర్, మెట్‌పల్లి, ఆర్మూర్ మీదుగా ఆర్టీసీ సూపర్‌లగ్జరీ బస్సు నడిపించనున్నట్లు డిపోమేనేజర్ ప్రతిమారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఖానాపూర్ పట్టణ ప్రజల కోరిక మేరకు ఈ బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతిరోజు ఖానాపూర్ బస్టాండ్ నుంచి సాయంత్రం 5:30కి బయలుదేరి రాత్రి 11:55 గంటలకు చేరుకుంటుందన్నారు. మరుసటి రోజు ఉదయం ఏడుగంటలకు బయలుదేరి నిర్మల్ చేరుకుంటుందని స్పష్టం చేశారు. ప్రయాణికులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రూ.23 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం

- ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్



సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

భైంసారూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో 23 కోట్ల రూపాయలతో ప్రస్తుతం సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ తెలిపారు. ఆదివారం భైంసా మండలంలోని కుంసర, కామోల్, మాటేగాం గ్రామాల్లో 44 లక్షల రూపాయల నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దశలవారీగా గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరవుతాయన్నారు. పంటపొలాలకు వెళ్లడానికి రోడ్లు ఇబ్బందికరంగా ఉన్నాయని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చామన్నారు. త్వరలో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానన్నారు. కామోల్ గ్రామంలో పోచమ్మ ఆలయ రోడ్డుకు 10 లక్షల రూపాయలు, మాటేగాంలో కొరడి గణపతి ఆలయానికి వెళ్లే రోడ్డుకు 28 లక్షల రూపాయల నిధులు కేటాయించామన్నారు. అదేవిధంగా కుంసర గ్రామంలో సీసీ రోడ్డుకు ఆరు లక్షల రూపాయల నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ సందర్భంగా ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు గ్రామస్థులు శాలువాతో సత్కరించి స్వాగతించారు. కార్యక్రమంలో ఎంపీపీ అబ్దుల్ రజాక్, భైంసా మండల బీజేపీ అధ్యక్షురాలు సీరం సుష్మరెడ్డి, సీనియర్ నాయకులు సోలంకి భీమ్‌రావు, సొంప్లీ రమేష్, పండిత్ రావు పటేల్, మాజీ వైస్ ఎంపీపీలు గంగాధర్, నర్సా రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు తాలోడ్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మణరావు, శ్యామ్ రావు పటేల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డిని బర్తరఫ్ చేయాలి


- భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్



మాట్లాడుతున్న భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్

భైంసా, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): శాసనసభ స్పీకర్‌పై అగౌరవపరిచేలా వ్యవహరిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డిని అసెంబ్లీ నుంచి బర్తరఫ్ చేయాలని భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్ డిమాండ్ చేశారు. ఆదివారం భైంసాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి అసెంబ్లీలో అనుసరించిన తీరును వ్యతిరేకిస్తూ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మాజీమంత్రిగా అపార అనుభవం కలిగిన ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి హోదాను మరిచిపోయి దిగజారుడు దోరణితో మాటలు మాట్లాడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. అసెంబ్లీ నుంచి ఆయనను సస్పెన్షన్‌తో సరిపుచ్చకుండా బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ప్రతినిధి షేక్ అంజాద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సాయినాథ్ పాటిల్, నడిమిశెట్టి భూమన్న, కాంగ్రెస్ ప్రతినిధులు దిగంబర్, రాజేశ్వర్, భగవాన్ పాటిల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు గాంధీ గంజ్ ప్రవేశ మార్గంలో నిరసన ప్రదర్శనలు చేపట్టారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

కడెం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ అన్నారు. కడెం మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన సొగ్గాల సుధాకర్‌కు మంజూ రైన రూ.45 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు బాధితుడికి అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... పేద ప్రజల ఆరోగ్యం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధ వహిస్తుందన్నారు. అందరికి సంక్షేమం అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

- లాడ్జి యజమానులకు ఎస్పీ హెచ్చరిక



లాడ్జిలో తనిఖీలు చేస్తున్న సీఐ

నిర్మల్‌కల్చరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : లాడ్జీలలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని ఎస్పీ జానకి షర్మిల యజమానులను హెచ్చరించారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో నిర్మల్ పట్టణ పరిధిలో ఉన్న రిసార్టులను, లాడ్జిలను అధికారులు తమ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారని తెలిపారు. నిర్వాహకులు లాడ్జిలకు వచ్చిపోయే అతిథుల ఆధార్ కార్డులో ఉన్న వివరాలు సరిచూడాలన్నారు. లగ్జరీ బుక్స్‌లో ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా నమోదు చేయాలన్నారు. నిర్వాహకులు నిబంధనలు అతిక్రమించవద్దని, ఉపేక్షించేవారిపై కఠిన చర్యలుంటాయన్నారు.

తనిఖీ చేసి పోలీసులు...

శాంతి భద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాలు అరికట్టడంలో భాగంగా ఆదివారం నిర్మల్ పట్టణంలోని పలు లాడ్జిలను పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. లాడ్జ్ రికార్డులను పరిశీలించారు. కొత్త వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని లాడ్జ్ యజమానులకు సూచించారు. ఎలాంటి సంఘ వ్యతిరేక కార్యకలాపాలు కొనసాగినా చట్టపర చర్యలుంటాయని తెలిపారు. పోలీసులు, సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

మెనూలో నాణ్యత పాటించడం లేదు



కుభీర్‌లోని కేజీబీవీ విద్యాలయం

కుభీర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో నాణ్యమైన భోజనాలు అందించడం లేదని పలువురు ఆరోపించారు. ఆదివారం తమ పిల్లలను కలిసేందుకు వచ్చినవారు ఉడికి ఉడకని పదార్థాలు చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో తమ పిల్లలు తరచూ అనారోగ్యానికి గురవుతున్నారని తల్లిదండ్రులు ఆరోపించారు. ఆదివారం 12.30 సమయం దాటినా వడ్డించలేదని, దీంతో పిల్లలు ఆకలితో అలమటించారని అన్నారు. ఇటీవల కేజీబీవీలో నీటి ఇబ్బందులు ఏర్పడినా నిర్వాహకులు పట్టించుకోకపోవడం కారణంగా బాలికలు వారం రోజుల పాటు స్నానాలు చేయలేదని తెలిపారు. కనీస అవసరాల కోసం విద్యార్థులే సమీప ప్రాంతాల నుంచి నీటిని తెచ్చుకున్నారని పేర్కొన్నారు. ఈ విషయాలను ఎవరికైనా చెబితే చర్యలు తీసుకుంటామని భయపెట్టారని పోషకులు పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు స్పందించి కేజీబీవీ విద్యాలయంలో నిర్వహణ సక్రమంగా జరిగేలా చూడాలని కోరుతున్నారు. ఈ విషయంపై వివరణ కోరేందుకు ఎస్‌వోకు ఫోన్ చేయగా స్పందించడం లేదు.

బాలుర కళాశాలలో ఇద్దరు విద్యార్థుల మధ్య ఘర్షణ

- వాలీబాల్ ఆడుతుండగా తలెత్తిన వివాదం
- ఒకరినొకరు తోసుకోవడంతో ఇంటర్ విద్యార్థి తలకు గాయం



పేరెంట్స్ సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తున్న ప్రిన్సిపాల్

ఖానాపూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్‌లోని మహాత్మాజ్యోతి బాపూలే బాలుర కళాశాలలో ఇద్దరు ఇంటర్ విద్యార్థుల మధ్య నెలకొన్న వివాదం చిలికి చిలికి గాలి వానలా మారింది. వివరాల్లోకి వెళ్తే ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న తరుణ్ అనే విద్యార్థి ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న తనయ్ అనే విద్యార్థి ఇద్దరు కెప్టెన్లుగా శుక్రవారం సాయంత్రం కళాశాల ఆవరణలో వాలీబాల్ మ్యాచ్ ఆడారు. ఈ వాలీబాల్ మ్యాచ్‌లో నెలకొన్న వివాదంతో ఇరువురు కెప్టెన్ల మధ్య మాట మాట పెరి గింది. ఈ వివాదంలో ఒకరినొకరు తోసుకున్నారు. కాగా గొడవ పడుతున్న ఇరువురు కెప్టెన్లను టీం సభ్యులు అడ్డుకున్నారు. తిరిగి శనివారం రాత్రి 11:30 గంటల సమయంలో సైతం ఇరువురు ఒకరి పట్ల ఒక దురుసుగా ప్రవర్తిం చుకోవడంతో సెకండ్ ఇయర్ చదువుతున్న తనయ్ అనే విద్యార్థి తరు ణ్‌పై దాడి చేసేందుకు ప్రయత్నించగా రాత్రి డ్యూటీలో ఉన్న సి.రమేష్ అనే ఫిజిక్స్ లెక్చరర్ మరో వాచ్‌మెన్ వెళ్లి విద్యార్థు లను మందలించి వివాదానికి చెక్‌పెట్టారు. కాగా ఆదివారం ఉదయం ఏడున్నర గంటల సమయంలో ఇరువురు విద్యార్థులు మరోసారి తలపడడంతో ఇంటర్మీ డియట్ మొదటి సంవత్సరం చదువు తున్న తరుణ్ అనే విద్యార్థిని తనయ్ తోసేశాడు. దీంతో తరుణ్ కింద పడడంతో తలకు గాయమైంది. ఉదయం గొడవ జరిగిన సమయంలో విధుల్లో ఉన్న వైస్ ప్రిన్సి పాల్ అనిల్ గాయపడిన తరుణ్‌ను వెంటనే ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం చేయిం చారు. కాగా ఆదివారం ఇరువురు విద్యార్థుల పేరెం ట్స్‌ను పిలిచి విద్యార్థులు ఇద్దరు గొడవ పడుతున్న విషయాన్ని వారికి తెలియజేసినట్లు ప్రిన్సిపాల్ సంతోష్ తెలిపారు. మరో మూడు రోజుల్లో పరీక్షలు ఉన్న నేపథ్యంలో ఇద్దరు విద్యా ర్థులను వారి వారి ఇళ్లకు పంపించి అక్కడి నుంచే పరీక్షలకు హాజరయ్యేలా చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. కళాశాలలో దురుసుగా ప్రవర్తించే విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకుం టామని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు.



వివాదాన్ని వివరిస్తున్న విద్యార్థులు

బాసరలో అలరించిన అష్టావధానం



కళాకారుల నృత్యాలు

బాసర, మార్చి, 16 : (ఆంధ్రజ్యోతి) : చదువుల తల్లి పుణ్యక్షేత్రమైన బాసరలోని శారదనగర్‌లో గల కోటి పార్థివ లింగస్థూప సాహిత ద్వాదశ జ్యోతి ర్లింగ మందిరం హాల్‌లో ఆదివారం విశాఖపట్నం వాస్తవ్యులు ప్రముఖ అవధానులు బొల్లా ప్రగాఢ శశిశర్మ నిర్వహించిన అష్టవధానం ఆద్యంతం ఆకట్టుకుంది. నిర్వాహకులు పద్యకవులు, సంస్కృత భాషా ప్రచార సమితి ఆదిలాబాదు, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వ్యవస్థాపక అధ్యక్షులు బి.వెంకట్ కవి, శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి సిద్ధాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షులు నిర్మల అంబిక నాథశర్మ నేతృత్వంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సంచాలకులుగా పద్యకవులు, బొండిడి పురుషోత్తమరావు, ప్రాశ్నికులుగా డా.కోవెల శ్రీనివాస చార్యులు (నిషిద్ధాక్షరి) కదారి దశరథ్ (సమస్యాపురాణం), బి. వెంకట్ (దత్తపది), పీసర శ్రీనివాస్ గౌడ్ (వర్ణన), గంగుల చిన్నన్న (న్యస్తాక్షరి), కొండూరు పోతన్న (చందోభాషణము), జాదవ్ పుండలిక్ రావు పటేల్ (ఆశువు), బసవ రాజు (అప్రస్తుత ప్రసంగం)లతో ఈ అష్టావధానం జరిగింది. ఈ సందర్భంగా నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా వాస్తవ్యులు కవి, పండితులు సమస్యా పృచ్ఛక పద్య శంకర కంది శంకయ్య, కవులు, కళాకారులు, సాహితి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

బాసర జ్ఞాన సరస్వతి క్షేత్ర విలసిత శివయోగి నిర్మల అంబయ్య సిద్ధాంతి సిద్ధాశ్రమము సరస్వతి స్తూప, కోటి పార్థివ లింగ స్తూప సహిత ద్వాదశ జ్యోతిర్లింగ మందిరములో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక నృత్యాలు పలువురిని అలరించాయి. హైదరాబాద్ శ్రీ వాగ్దేవి సంస్కృత భారతి వారితో నిర్వహించిన బాలికల నృత్యాలను అవధాని బొల్లా ప్రగాఢ శశి శర్మ, కంది శంకరయ్య, సంచాలకులు బొండిడి పురుషోత్తం రావు, అష్టావధాన పృచ్ఛకులు, పద్యకవులు, డా. కోవెల శ్రీనివాస చార్యులు. బి. వెంకట్, జాదవ్ పుండలిక్ రావు పాటిల్, కదారి దశరథ్, గంగుల చిన్నన్న, కొండూరు పోతన్న, బసవరాజు పీసర శ్రీనివాస గౌడ్, ఆశ్రమ నిర్వాహకులు సంధ్య, అంబిక నాథ శర్మ, దంపతులు తదితరులు అభినందించారు.



అష్టావధానంలో అవధాని తదితరులు